www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024



15న కవితల పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 15న కవితల పోటీని నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కవితల పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేస్తామని తెలిపారు. కడప నగరంలో ఉన్న యువతి, యువకులు పోటీలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ పోటీకి సంబంధించిన వివరాల కోసం సాహితీ స్రవంతి కన్వీనర్ లెనిన్ ప్రసాద్ సెల్ నంబర్ 919490660424, పిళ్ళా కుమారస్వామి, 9490122229ను సంప్రదించాలని తెలిపారు.

కౌంటింగ్‌కు కౌంట్ డౌన్

- ఇక...రెండ్రోజులే!
- ప్రతి అసెంబ్లీ, లోకసభకు 14 టేబుళ్లు
- మూడంచెల భద్రత మధ్య కౌంటింగ్
- 18 నుంచి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు



కడపలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఇతర అధికారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం పోలింగ్ ముగిసిన దగ్గర నుంచి 21 రోజుల అనంతరం కౌంటింగ్ నిర్వహిస్తోంది. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటముల మధ్య జోరుగా బెట్టింగులు నడుస్తున్నాయి. జూన్ ఒకటిన వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో అస్పష్టత నెలకొంది. ఇటువంటి అస్పష్టతకు తెరదించడానికి రెండ్రోజులే సమయం మిగిలింది. కడప నగర శివారులోని మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ, అన్నమయ్య జిల్లాలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సుబ్బయ్య ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 14 టేబుళ్ల చొప్పున 294 టేబుళ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు 18 రౌండ్ల నుంచి 23 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. జూన్ నాలుగున ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవిఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి సాధారణ ఈవిఎంల్లోని ఓట్ల లెక్కంపు ఏర్పాట్లను జిల్లా అధి కార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పా టు చేసింది. ఒక్కో ఇవిఎం టేబుల్ దగ్గర సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ ఉండనున్నారు..పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు టేబుల్ దగ్గర అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్ ఉండనున్నారు. ఎలక్ట్రానికల్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ ఓట్ల లెక్కింపు వద్ద 10 టేబుల్స్‌కు ఎఆర్‌ఓ, సిఎస్, సిఎ చొప్పున ఉండనున్నారు. 130 శాతం అవసరాల మేరకు 293 కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 374 కౌంటింగ్ అసిస్టెంట్లు, 368 మంది మైక్రోఅబ్జర్వర్లను నియమించారు. సాధారణ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నెల 25న కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. జూన్ రెండవ తేదీ రెండో విడత ర్యాండమైజేషన్ జరగనుంది. కౌంటింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి సిబ్బందికి కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. జూన్ ఆరవ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించడానికి 112 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, కారియార్స్‌ను కవర్ చేసే విధంగా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాలులో ఈవిఎంలకు సంబంధించిన కదలికలను డిస్ ప్లే ఏర్పాట్లు చేశారు. ఇటిపిబిఎస్ స్కానింగ్ కోసం సరిపడే క్యూఆర్ కోడ్ రీడర్స్‌ను సిద్ధంగా ఉంచారు. ఏర్పాట్లకు సరిపడేలా కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, యూపిఎస్, స్టేషనరీ, టెలిఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచారు. స్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు వీవీప్యాట్లను ఎలాంటి అంతరాయం లేకుండా తీసుకెళ్లేందుకు వీలుగా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్ర ప్రదేశంలోనికి అనుమతి లేని వ్యక్తులు ప్రవే శించకుండా మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలోని రక్షణ వలయం ఉండనుంది. దీని పరిధిలోనికి ఎలాంటి వాహనాలను అనుమతించే అవకాశం లేదు. ప్రధాన ప్రవేశద్వారం వద్ద పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ అధికారుల గుర్తింపును పరిశీలిస్తారు. ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపుకార్డులను, లేదా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో, ఐడీ కార్డులను, మీడియా పాసులను పరిశీలించిన అనంతరం ప్రవేశానికి అనుమతి ఇస్తారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారిని నియమించారు. కౌంటింగ్ కేంద్రంలోనికి ప్రవేశించే ద్వారం వద్ద రెండో భద్రతా వలయం పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత అనుమతిస్తారు. అగ్గిపెట్టెలు, ఆయుధాలు, మొ బైల్‌ఫోన్లు, ఐప్యాడ్స్, ఇతర ఎలక్ట్రానిక్ డివైజెస్‌ను లోపలికి తీసుకెళ్ల కుండా చూస్తారు. వీటిని అక్కడ ఏర్పాటు చేసిన మీడియా గదు ల్లో భద్ర పరుచుకోవాల్సి ఉంటుంది. ఆప్రాంతంలో అనుమతించిన గదు ల్లో మాత్రమే భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రం లోనికి ప్రవేశించే ద్వారా వద్ద మూడో భద్రతా వ్యవస్థ ఉంటుంది. ఇక్కడ కేంద్ర సాయుధ బలగాలు ఉంటాయి. ఇక్కడ చేసిన తనిఖీల నిర్వహించిన అనంతరం కౌంటింగ్ హాలులోకి ప్రవేశించే అవకాశం ఉంది.

ఇంక్రిమెంట్ నిలిపేస్తామనడం అన్యాయం : యుటిఎఫ్



వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన ఎన్నికల విధుల్లో పాల్గొనని ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు కోత పెట్టడానికి సిద్ధపడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్‌బాబు అన్నారు. శనివారం సాయంత్రం పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగటానికి ఉపాధ్యాయులంతా సమిష్టిగా పనిచేశారని అధికారులు గుర్తించాలని కోరారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కంటే ఈ ఎన్నికలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యూనరేషన్ కూడా రకరకాలుగా చెల్లించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యునరేషన్ తేడాలపై అధికారులు స్పందించలేదన్నారు. ఎన్నికల విధులకు హాజరు కాలేక పోయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ ఆరోగ్య సమస్యలపై, ఇంట్లో తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితులు, అలాగే వారి పిల్లల ఆరోగ్య పరిస్థితుల కారణంగా హాజరు కాలేదని, వారికి ఇంక్రిమెంట్లు కట్ చేయాలని భావిస్తున్న అధికారుల వైఖరి సరికాదన్నారు. జిల్లాలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రెండు రోజులు అహర్నిశలు పనిచేసి జయప్రదం చేశారన్నది వాస్తవని పేర్కొన్నారు. వారందరికీ అభినందనలు తెలియజేయాల్సిన అధికారులు రకరకాల ఆరోగ్య సమస్యలపై పాల్గొనని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం కోసం సిద్ధపడటాన్ని విరమించుకోవాలని కోరారు. ఇది మొదటి తప్పుగా భావించి భవిష్యత్తులో పాల్గొనకపోతే తీవ్రమైన దండన ఉంటుందని హెచ్చ రించలన్నారు. అందుకోసం అధికారులు సహృదయంతో వారిపై చర్యలు తీసుకో వటాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారావు, వీరనారాయణ, విశ్వనాథ్, గంగన్న పాల్గొన్నారు.



తలపడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు

చిత్తూరుపై నెల్లూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా శనివారం వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు నిర్ణీత 50.0 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె.ఎన్.పృథ్వీరాజ్ 67 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టుకు చెందిన సాకేత్ రామ్ 3, ఎస్.ఎ.సల్మాన్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 244 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 41.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని నిఖిలేష్ 88 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టుకు చెందిన ఎన్. మాధవ్ రాయుడు 2, వర్షిత్ రెడ్డి 2, కె.దీపన్ సాయినాథ్ 2 వికెట్లు తీసుకున్నారు.

కర్నూలుపై అనంతపురం జట్టు..

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 7 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 50.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 369 పరుగులు చేసింది. ఆ జట్టులోని గిరినాథ్‌రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు.67 బంతులను ఎదుర్కొని 5 బౌండరీలు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేశాడు. రాజు కుల్లాయప్ప 6 బౌండరీలు, 3 సిక్సర్ల సహాయంతో 100 పరుగులు చేశాడు. కర్నూలు జట్టుకు చెందిన కంరుద్దీన్ 2, ఆంజనేయులు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 370 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 49.2 ఓవర్లలో 362 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని కరణ్ షిండే బ్యాటింగ్ లో అదు తేంగా రాణించాడు. 110 బంతులను ఎదుర్కొని 18 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 135 పరుగులు చేశాడు. సంజయ్ నాయుడు 72 పరుగులు చేశాడు. అనంతపురం జట్టు లోని సంతోష్ 4 వికెట్లు తీసుకున్నాడు.

టిడిపి ఏజెంట్ ద్విచక్ర వాహనం దగ్ధం



వాహనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని శంకరపురంలో టిడిపి అభ్యర్థి మాధవి తరుపున బూత్ ఏజెంట్‌గా వ్యవహ రించిన ప్రసాద్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారు జామున కాల్చి వేశారు. విషయం తెలుసుకున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవి ఘటన స్థలానికి చేరుకుని దగ్గమైన వాహనాన్ని పరిశీలించారు. ప్రసాద్‌రెడ్డిని విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలన్నారు. ఈ విషయం పై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని రెచ్చగొట్టే చర్యలు చేసిన మేము, మా కార్యకర్తలు శాంతియుతంగా ఉంటామని స్పష్టం చేశారు.

బైక్ దగ్ధంపై కేసు నమోదు : ఎఎస్‌పి

శంకరాపురంలోని కొత్త రామాలయం వీధిలో నివాసం ఉంటున్న సిరికిరెడ్డి ప్రసాద్‌రెడ్డి బైక్ దగ్ధంపై కేసు నమోదు చేశామని ఎఎస్‌పి లోసారి సుధాకర్ పేర్కొన్నారు. చిన్నచౌక్ పోలీసుస్టేషన్లఓ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బైక్ ప్రమాదవశాత్తు తగలబడిందా ఎవరైనా కక్షపూరితంగా తగలబెట్టారా అన్న విషయంపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు బైక్ టిడిపి ఏజెంట్ ది అనడంలో వాస్తవం లేదన్నారు. కౌంటింగ్ సమయంలో ఇలాంటివి ప్రచారం చేయవద్దని కోరారు. దోషులను పట్టుకుని శిక్షిస్తామని చెప్పారు. సమావేశంలో డిఎస్‌పి షరీఫ్, సిఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలని రైతులకు సరిపడన్ని పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలగలు మంజూరు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం కడప జిల్లా రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతంగానికి సబ్సిడీ రూపంలో వేరుశనగ, పత్తి, వరి, జీలుగులు, ఆర్‌బికె కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు వెంటనే అందించెందుకు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పత్తి విత్తనాలు అధిక రేట్లను, బ్లాక్ చేసే విధానంకు అధికారులు చర్యలు తీసుకుని కంట్రోల్ చేయాలన్నారు. రైతులకు పెట్టుబడులకు అవసరమైన విధంగా బ్యాంకులు స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికి అందించాలన్నారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కలిగించి ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. కౌలు రైతులకు భూయజమానులకు సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దుచేసి రైతుల సమక్షంలో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి గత పాసు పుస్తకాలను అనుసరించి సవరించాలన్నారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూ సర్వే రద్దు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విత్తనాలు కొరత సందరేగా జరుగుతున్న రైతుల ఆందోళనలు ఆంధ్రప్రదేశ్ విత్తనాల కొరత జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ, మండల స్థాయిలో రైతులను చైతన్యపరిచి రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్న సిద్దయ్య, రామచంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా జరిగి త్వరితగతిన ఫలితాలు వెల్లడయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, పాటించవలసిన నిబంధనలపై నగర పాలక సంస్థ కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్‌లతోకలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సిసి కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని 4వ తేదీన ఎంతో పటిష్టంగా పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలను చేపట్టామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్స్ లేఅవుట్, కౌంటింగ్ ఏజెంట్ల అపాయింట్మెంట్ పద్ధతి, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియమాలు, చెయ్యకూడని పనులు, ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు విధానం, కౌంటింగ్ ఏజెంట్లుగా ఎవరిని నియమించాలి? ఎంతమందిని నియమించాలి? ఫుడ్ అరేంజ్మెంట్స్, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్, మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, త్రీ లేయర్ సెక్యూరిటీ విధానం తదితర అంశాలలో తీసుకున్న చర్యలను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు వివరించారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలు సూచనలను పక్కాగా పాటించడం జరుగుతుందన్నారు. గెలుపు ఓటములు సహజమని వాటిని సమభావంతో తీసుకోవాలన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులతో పాటు సంబందిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప వారు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ 19వ వార్షికోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని శనివారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించారు. గ్రామీణ ప్రాంతీయ కార్యాలయం చుట్టుపక్కల శాఖల సిబ్బంది సంయుక్తంగా రక్తదానంలో పాల్గొన్నారు. గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వ్యాపార నిర్వహణలో దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులకెళ్ళ ప్రగతి పథంలో ఉన్నదని తెలిపారు. డిపాజిట్లు, రుణాలు కలిపి రూ.46,350 కోట్లు వ్యాపారాన్ని అదిగ మించిందని చెప్పారు. లాభా ర్జనలో మొదటి స్థానంలో ఉంటూ స్వయం ప్రతిపత్తితో నిలబడినది ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అని తెలిపారు. సిబ్బంది, ఖాతాదారులు రక్త దానం చేయాలని కోరారు. 70 సార్లకు పైగా రక్తదానం చేసిన శివ శంకర్‌రెడ్డిని ప్రశంసించారు. రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు చాలా ఉన్నతంగా ఉన్నాయని పేర్కొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్



ఛాయాచిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జిల్లా కేంద్ర గ్రంథాలయం కడపలో వేసవి బాలల వినోదం కార్యక్రమంలో భాగంగా సర్ సి.వి.రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి శనివారం విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని తాను రూపొందించిన చాయ చిత్రాల ద్వారా వివరించారు. నేడు జీవనశైలిలో మార్పుల కారణంగా అన్ని వయసుల వారికి, శరీరంలో ఏ అవయవానికైనా కేన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, నేటి అత్యాధునిక పరీక్షలు కేన్సర్ ప్రాథమిక దశలోనే గుర్తిస్తున్నాయని చెప్పారు. మెరుగైన వైద్య చికిత్స పద్ధతులతో కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే కేన్సర్ కణాలనును శరీరంలో సమూలంగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో తగు మార్పులు చేసుకుని, సాంప్రదాయక ఆహారపు అలవాట్లు, సరియైన నిద్ర, ప్రాణాయామం, ధ్యానం అవలంబించి, మానసిక ప్రశాంతతతో కేన్సర్ దరిచేరనీయకుండా జీవించవచ్చని ఛాయాచిత్రముల ద్వారా వివరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సమీర్ బాషా విద్యార్థులకు మ్యాజిక్ పైన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి లైబ్రేరియన్ పవన్ కుమార్, లైబ్రేరియన్ సుబ్రమణ్యం, సిబ్బంది సుబ్బమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

గృహనిర్బంధాలు, బహిష్కరణలు దారుణం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎన్నడూ గృహ నిర్బంధాలు ఘర్షణలు లేవని, ఈ ఎన్నికల్లో పోలీసులు అత్యుత్సాహం చూడం దారుణమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ వద్ద ఎమ్మెల్యే తమ్ముడు అహ్మద్‌బాషా నోటికి వచ్చినట్లు మాట్లాడి, దాడి చేసినప్పుడే జిల్లా బహిష్కరణ చేసి ఉంటే కడపలో ఘర్షణ వాతావరణం ఉండేది కాదని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఘర్షణలకు ఎమ్మెల్యే అంజాద్ బాషా ఆయన తమ్ముడు అహ్మద్ బాషా, అల్లుడు కారణమని చెప్పారు. ఎమ్మెల్యే, ఆయన తమ్ముడు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరు వైసిపి ఎమ్మెల్యేగా, మరొకరు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారికి పాసులు ఇవ్వడం సరికాదని చెప్పారు. ఎన్నికల రోజు పోలీసులు తీసుకోవలసిన జాగ్రత్తలు విస్మరించి కౌంటింగ్ రోజు హడావిడి చేయడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. అన్ని పార్టీలను కలెక్టర్, ఎస్పీ సమానంగా చూడాలని కోరారు. రూల్స్ లేవని మాట్లాడిన సజ్జలపై ఎలక్షన్ కమిషన్ కేసు పెట్టిందని తెలిపారు. ఇప్పటికీ వైసిపి నాయకులకు వత్తాసు పలికే పోలీసులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇలాంటి వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి కడపలో లేదన్నారు. పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్, బహిష్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు సుబ్బారెడ్డి, జయరాం, రామప్రసాద్, రామాంజి, సునీత పాల్గొన్నారు.

మూడంచెల భద్రతతో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జెసి గణేష్ కుమార్, నగర కమిషన్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌంటింగ్ కేంద్రంలో ఏయే ఫ్లోర్లలో ఏయే నియోజకవర్గ కౌంటింగ్ టేబుళ్లు, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ రూమ్, మీడియా కేంద్రం తదితరాల ఏర్పాటు స్థలాలను, సూచిక బోర్డులు ఏర్పాటు, కౌంటింగ్ హాలు లోకి ప్రవేశించేందుకు అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు విడివిడిగా బారికేడింగ్ ఏర్పాటు తదితరాలను పరిశీలించి సంబంధిత నోడల్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేయడం జరిగిందన్నారు. ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి సుధాకర్, అడిషనల్ ఎఎస్‌పి కృష్ణారావు, కడప రిటర్నింగ్ అధికారి మధుసూదన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

తిరుపతి నగరానికి చెందిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఎకనామెట్రిక్స్ ప్రొఫెసర్, ప్రముఖ కథా నవలా రచయిత డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడు తన భార్య సరస్వతితో కలసి శనివారం న్యూ బాలాజీ కాలనీలోని తన స్వగృహంలో 500 పుస్తకాలను (300 తెలుగు పుస్తకాలు, 200 ఇంగ్లీషు పుస్తకాలు) సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడు బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో బతుకుబాట, తొలకరి వానకు తడిసిన గుండె, జీవనం, తొలిసంధ్య, వ్మాయ దివాకరుడు, కవితా మంజరి, పినలగర్ర, చేరా అభినందన సంచిక, ఆరని దీపాలు (మహనీయుల జీవనరేఖలు), నెమలికన్ను, కలకత్తాకి దగ్గరలో, ప్రజాబంధు శ్రీ పాటూరి రాజగోపాల నాయుడు, బతుకు పుస్తకం, వ్యవసాయరంగము-కనీస మద్దతు ధరలు, అగ్రికల్చరల్ గ్రోత్ అండ్ పొటెన్షియల్ ఇన్ ఆంధ్రప్రదేశ్, అగ్రికల్చరల్ ప్రొడక్టివిటీ ఇన్ ఆంధ్రప్రదేశ్, సమ్ యాస్పెక్ట్స్ ఆఫ్ ఎర్రర్స్ ఇన్ వేరియబుల్స్ లీనియర్ మోడల్, ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ మొదల్కెన 8 ఎకనామెట్రిక్స్ సిద్ధాంత గ్రంథాలు, ట్రియట్కెజ్ ఆన్ జస్ట్ ప్రైస్ పాలసీ, పీజంట్ ఎకానమీ సమ్ కాంట్రిబ్యూషన్స్ ఆఫ్ ఎన్.జి.రంగ, ఇండియన్ ఫెమైన్ కమిషన్ (1898), ఇండియన్ ఫెమైన్ కమిషన్ (1901), హాట్, ఫ్లాట్ అండ్ క్రౌడెడ్ తదితర గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడును వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.



మాట్లాడుతున్న నంద్యాల వరదరాజులరెడ్డి

వైసిపి నేతలకు పోలీసుల అండదండలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో వైసిపి నేతలకు కొంతమంది పోలీసుల అండదండలున్నాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో శనివారంా యన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు రోజున ప్రొద్దుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తించిన 135 మంది ట్రబుల్ మాంగర్స్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఉంచాలన్నారు. అలా కాకుండా జిల్లా బహిష్కరణ చేస్తే ఎక్కడికి వెళతారని వరదరాజుల రెడ్డి ప్రశ్నించారు. గతనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, మాచర్లలోని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఇవిఎంలను పగులు కొట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉందని ఆయన భావించారు. ప్రొద్దుటూరులో ఓ హత్యా నేరంలో నిందితులు ట్రబుల్ మాంగర్స్‌లా పోలీసులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులను వదిలిపెట్టి టిడిపి నాయకులను టార్గెట్ చేస్తున్నారంటూ వరద తీవ్రంగా విమర్శించారు. వైసిపిలో ఉన్న రౌడీషీటర్లపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమీర్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్, శిల్పారామంలో నృత్య ప్రదర్శన ఉంటుందని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వారి నాగార్జున స్కూల్ చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో.. శిల్పారామంలో స్థానిక శ్రీ రాజా కళానిలయం ఆధ్వర్యంలో క్లాసికల్, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని భూమాయపల్లె వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న వృద్ధాశ్రమంలో శనివారం వైసిపి నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అగ్రహార సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, నాయకులు సుభాన్, నాగేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీకి పరామర్శ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాలలో ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీ పాము కాటుకు గురయ్యాడు. శనివారం గ్రామ సమీపంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్ కాలువలో ఉపాధి కూలీ రాజశేఖర్ రెడ్డి జంబు తొలగిస్తుండగా పనులు చేస్తుండగా పాము కాటేసింది. ఇతర కూలీలు గుర్తించి వెంటనే పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పినట్లు ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు. బాధితుడ్ని ఉపాధి హామీ చట్టం ఎపిఒ జయ భారతి, సిబ్బంది పరామర్శించారు.



పాఠ్యపుస్తకాలతో విద్యాశాఖాధికారులు

ఎర్రగుంట్లకు చేరిన పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని పాఠశాలలకు అందించవలసిన పాఠ్యపుస్తకాలు శనివారం ఎర్రగుంట్లకు చేరినట్లు మండల విద్యాశాఖ అధికారులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 43వేల పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేయవలసి ఉండగా, ఇందులో 50 శాతం మండల కేంద్రానికి చేరాయని తెలిపారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో చేరుకుంటాయని తెలిపారు. మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి పాఠశాలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజ నేయులు రెడ్డి, మండల విద్యాశాఖ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలి

ఆర్‌బికె సిబ్బంది సమావేశంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్‌బికెల్లో నిల్వ ఉండేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఎఒ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువుల పరిమాణం కోసం ఇండెంట్ పెట్టి స్టాక్ తెప్పించుకోవాలన్నారు. వేరుశనగ విత్తనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే కొర్ర, మినుము, పెసర, కంది రకాలు ఆర్‌బికెల వారీగా కావాల్సిన విత్తనాల పరిమాణాలను రైతులను అడిగి తెలుసుకుని నివేదికలు ఇవ్వాలన్నారు. సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు ఇవ్వాలన్నారు. వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి రైతు వాటా డబ్బులను విత్తన ఏజెన్సీకి చెల్లించాలని సిబ్బందికి ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా ప్రతి రోజు సమయపాలన పాటించాలన్నారు. అన్ని రకాల రిజిష్టర్లను అప్డేట్ చేసి పెట్టుకోవాలని కోరారు. ఖరీఫ్‌లో నిర్వహించే పొలంబడి గురించి సిబ్బందితో చర్చించారు. అనంతరం నెలవారీ రైతు భరోసా మాస పత్రిక పుస్తకాలను సిబ్బందికి అందించారు.



సిబ్బందికి మాసపత్రికలు అందజేస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

అందనంత ఎత్తులో టమోటా ధర

దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో పెరిగిన డిమాండ్ - కిలో రూ.60



మార్కెట్‌కు తరలిస్తున్న టమోటా కాయలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేసవికాలం వస్తుందంటేనే ప్రజల గుండెల్లో గుబులు మొదలవుతుంది. వాతావరణన్ని భిన్నంగా ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వేసవికాలంలోనే ఉంటాయి. ఒక్కోరోజు ఒక్కో విధంగా భానుడు ఆయన ప్రతాపాన్ని చూపుతుంటాడు. మొక్కలపై కూడా సూర్యుడు తన ప్రతాపం చూపిస్తూ ఉంటాడు ఎండాకాలం.. మండేకాలం కావడంతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో కూరగాయల ధరలు మార్కెట్‌లో అధికంగా ఉంటాయి. కూరగాయల్లో ముఖ్యమైంది టమోటా. టమోటా ధరలు విపరీతంగా పెరిగాయి. దిగుబడి తగ్గడంతో టమోటా ధరలు పెరిగాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం టమోటా కిలో రూ.40-రూ.60 ధర ఉంది. మరో నెలరోజులపాటు ఈ ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతుండడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో కూరగాయాలు కొనాలంటే వినియోగదారులు హడలిపోతున్నారు. సాధారణంగా పులివెందుల కూరగాయల మార్కెట్‌కు ప్రతిరోజూ 3 నుంచి 6వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు వస్తుంటాయి. ప్రస్తుతం 50 శాతం కూడా సరఫరా కావడం లేదని మార్కెట్ అధికారులు, వ్యాపారస్తులు చెబుతున్నారు. వర్షాలు కురిస్తేగాని సాధారణ పరిస్థితులు నెలకొనవని అంటున్నారు. ఎండలు తీవ్రతతో సాగునీరు లేక రైతులు కూరగాయల సాగు చేపట్టడంలేదు. ఈ పరిస్థితుల్లో పులివెందులలో కూరగాయల కోసం మదనపల్లి, కర్ణాటక రాష్ట్ర మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. జూన్ చివరి వరకూ ఇదే పరిస్థితి నెలకొననుంది. రైతుల నుంచి టమాటా, సరఫరా పూర్తిగా నిలిచిపోయిందనే చెప్పుకోవాలి. కొన్ని రోజుల క్రితం వరకు నియోజకవర్గంలోని అన్ని మండలాలతోపాటు సరిహద్దుల్లోని అనంతపురం జిల్లా, కర్ణాటకలోని కొన్ని జిల్లాల నుంచి లారీల్లో టమాటా దిగుమతి కాగా.. ప్రస్తుతం మదనపల్లి. కర్ణాటక నుంచి మాత్రమే వస్తున్నాయి. నెల రోజులు క్రితం పులివెందుల నియోజకవర్గంలోని రైతుల నుంచి రోజుకు 2 నుంచి 4 టన్నులు దిగుమతి కాగా, ప్రస్తుతం టన్నుకు మించి రావడం లేదు. దిగుబడి తగ్గడంతో టమోటా ధరలు విపరీతంగా పెరిగాయని అధికారులు, వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆఫ్ సీజన్‌లో స్థానికంగా కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండవు. దీంతో కమీషన్ ఏజెంట్లు ఇతర జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్‌కు కూరగాయలు తెప్పిస్తారు. వారు నిర్ణయించిన ధరలకే కొనాల్సి వస్తోంది. సాగులేకే అధిక ధరలు. ఏప్రిల్ నుంచి శివారు జిల్లాల నుంచి కూరగాయల దిగుమతి తగ్గిపోయింది. మే నెలలో డిమాండ్ ఉన్నా సరఫరా 30 శాతం మించదు. సాధారణంగా వేసవిలో ఎండలు కారణంగా తోటలకు నీరు అందదు. దీంతో కూరగాయల సాగు అంతగా ఉండదు. పులివెందుల నియోజకవర్గంలోని కూరగాయల అవసరాలు తీర్చడానికి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు అవుతుంటాయి. టమాటా ధరలను నియంత్రించడానికి ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు కూడా టమోటాలకు ఎక్కువగా అలవాటు పడి ప్రస్తుతం తగ్గించి తినాలంటే తినలేం అంటున్నారు. ఎంత రేటు ఉన్నా కూరగాయలు కొనక తప్పదు.. వండక తప్పదు.. తినక తప్పదు. జిల్లాలోనే వేసవిలో కూరగాయల సాగుకు అధికారులు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తే ఈ పరిస్థితి ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవగాహనతో మలేరియాను అరికట్టవచ్చు

ప్రజాశక్తి - చాపాడు

అవగాహనతో మలేరియాను అరికట్టవచ్చని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.కావ్యమాధురి తెలిపారు. స్థానిక నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో యన్.ఓబాయపల్లె దళితవాడ గ్రామంలో శనివారం ప్రపంచ మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యానికి చేరువలో మలేరియా రహిత సమాజం ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేకపోరాటాన్ని వేగవంతం చేద్దామన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు గుడ్లు పెట్టి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వస్తాయన్నారు. దోమకాటు చాలా ప్రమాదమన్నారు. నివారణ చర్యలు మీ ఇంటి మురికి కాలువలో చెత్త చెదారం వేయకూడదన్నారు. మురికి నీరు నిల్వ లేకుండా పారేలా చూడాలన్నారు. ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లను, నీటి నిల్వలలోని గుర్రపు డెక్కలను పూర్తిగా తొలగించాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, సూపర్‌వైజర్ బాబురెడ్డి, యంఎల్‌హెచ్‌పి కీర్తి, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పోతూలురమ్మ, ఓబుళమ్మ, సావిత్రి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

హిందూ ధార్మిక సంఘాల సంఘటిత స్ఫూర్తితో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని చెరువుకాంపల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు గంగాధర ఆధ్వర్యంలో స్కూటర్ల ర్యాలీ నిర్వహించారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ క్షేత్రం నుండి రాజ్యసభ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎస్‌వి సతీష్ కుమార్ రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. మూడేళ్లుగా చక్రాయపేటలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి(అడ్వకేట్), మాజీ చైర్మన్లు కర్నాటి హరినాథరెడ్డి, చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి కృషి, పట్టుదలతో మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లారు. బైక్‌లకు ఆంజనేయ స్వామి జెండా కట్టుకొని గండి క్షేత్రంలో ప్రారంభమైన ర్యాలీ అద్దాలమర్రి, కుమార్ కాలువ, ఎర్రబొమ్మనపల్లె పంచాయతీలోని సిద్ధారెడ్డిగారిపల్లె, జోరెడ్డిగారిపల్లె, తక్కల్లపల్లి, కే రాజుపల్లె, కుప్పం, బురుజుపల్లి, మహదేవ్‌పల్లె, సురభి బాల తిమ్మయ్యగారి పల్లె, నాగలగట్ట పల్లె, దేవరగట్టుపల్లె మీదుగా ర్యాలీ సాగింది. వీరికి చెరువుకాంపల్లె గ్రామానికి చెందిన పెద్దనేని జయరాం నాయుడు, పెద్దనేని చంద్రమౌళి నాయుడు, ఎద్దుల రామచంద్ర అల్పాహారం ఏర్పాటు చేశారు. దాతలు చల్లని మజ్జిగ, పానీయాలు అందించారు. దేవస్థాన ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో ముగిసినఉత్సవాలు

గండి వీరాంజనేయ క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహించిన హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, వేద పండితులచే అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. **పులివెందుల టౌన్ :** హనుమజ్జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు . పడమటి ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు ఆంజనేయ స్వామి ఆలయం, కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం, కే.వెలమవారిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీటితోపాటు ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్రకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిడువెలగల సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలను పంపిణీ చేశారు. అంకాలమ్మ గూడూరు వద్దనున్న ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సింహాద్రిపురం, గురజాల, నంద్యాలంపల్లె తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయం, పెద్దపసుపల మోటులోని ఆంజనేయస్వామి, గండికోటలోని శ్రీ రామగిరి అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి బ్రహ్మశ్రీ గడియారం గిరినాథ శర్మచే పూజలు, అర్చన, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారికి తమలపాకుల పూజ ఘనంగా చేశారు. రాత్రికి వేపరాల కళాకారులచే భజన చేపట్టారు. ఆంజనేయస్వామి వారి దేవాలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. **చెన్నూరు :** మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవ ఉద్దండ విద్య శంకర భారతిస్వామి వారి ఆశీస్సులతో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజామున వేద పండితులు సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. అలయ కమిటీ సభ్యుడు చంద్రమౌళీశ్వర స్వామి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం చెన్నూరు కు చెందిన గలిజర్ల సాంబరాజు కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. నెల్లూరు బృందం కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. పెన్నానది ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. చెన్నూరు మండలం బుడ్డాయిపల్లి జాతీయ రహదారిపై వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామనపల్లి గ్రామంలో వలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

185 మంది పోలింగ్ సిబ్బందికి రెండు ఇంక్రిమెంట్లు కట్

- కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

ఎన్నికల పోలింగ్ విధుల్లో అలసత్వం వహించిన 185 మంది పోలింగ్ సిబ్బందికి రెండు ఇంక్రిమెంట్లను నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది మే 12, 13 తేదీల్లో పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించి ఎన్నికల ప్రక్రియ ఆలస్యానికి కారకులైన 185 మంది పోలింగ్ సిబ్బందికి ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ -134 ప్రకారం వారి రెండు ఇంక్రిమెంట్లను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

క్రీడా దుస్తులు వితరణ

తంబళ్లపల్లి : తంబళ్లపల్లె పాత కళాశాల మైదానంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ లోని పిల్లలకు పలువురు దాతలు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. శిక్షణా శిబిరంలో శిక్షణ పొందుతున్న వంద మంది పిల్లలకు పట్టణానికి చెందిన బిబిజె ఫ్యాన్సీ బాషా, నిజాం టెక్స్‌టైల్స్ జహీర్, ఇండియన్ ఆయిల్ ఇలియాజ్, నౌషీర్, డాక్టర్ మున్నా, స్టాంప్ రైటర్ మస్తాన్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు దాతలను శాలువ, పూల మాలలతో సన్మానించారు.

బి.కొత్తకోటలో పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో శనివారం సిఐ సూర్యనారాయణ ఆదేశాల మేరకు పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఐ బొజ్జ నాయక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ప్రధాన పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజ కీయనాయకుల కోసం తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతి భద్రలను కాపాడాలని సూచించారు.



అవార్డు అందుకున్న సుజన్‌కుమార్ దరియా

సుజన్‌కుమార్ దరియాకు రాష్ట్ర ఉత్తమ ఎంసి అవార్డు

- ఎర్రగుంట్ల వాసికి విజయవాడలో అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అంతర్జాతీయ ఈవెంట్ మేనేజర్స్ డే శుభ సందర్భంగా ఎర్రగుంట్లకు చెందిన సుజన్‌కుమార్ దరియాను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ (మాస్టర్ ఆఫ్ సిరిమోనీస్) ప్రతిష్టాత్మక రాష్ట్ర ఉత్తమ ఎంసీ (మాస్టర్ ఆఫ్ సెరిమోనీస్) అవార్డుతో సత్కరించింది. ఈ గుర్తింపు యాంకర్‌గా, మెజీషియన్‌గా, టీచర్‌గా, ఈవెంట్ మేనేజర్‌గా ఆయన అందించిన శ్రేష్ఠమైన సేవలకు నిదర్శనం. సుజన్‌కుమార్ దరియా జిల్లా, రాష్ట్రంలో అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా సేవలు అందించడమే కాకుండా ఈవెంట్స్ పరిశ్రమలో గణనీయమైన ప్రభావాన్ని చూపారు. ప్రేక్షకులకు మరపురాని అనుభవాలను సృష్టించడానికి ఇంద్రజాల కళతో ఆకర్షణీయమైన ఎమ్సీయింగ్ నైపుణ్యాలను మిళితం చేశారు. బోధన పట్ల మక్కువ, నిశితమైన ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యంతో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాడు. సుజన్‌కుమార్ మాట్లాడుతూ ఎపిసిఇఐ కన్వీనర్ హరీష్ రవ్వా, గౌరవ సలహాదారుడు జయశంకర్, అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యక్షుడు గుప్త, కో-కన్వీనర్ హసీనాతోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.



మైదానాన్ని పరిశీలిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

క్రీడా మైదానంలో స్తంభాలను తొలగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ముద్దనూరు రోడ్డు పతంగి రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడాకారులకు, విద్యార్థులకు ఉపయోగపడని స్తంభాలను ఉన్నతాధికారులు తొలగించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పట్టణ కార్యదర్శి నంద్యాల తులసిశ్వర యాదవ్ కోరారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పిఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిరుపయోగంగా ఉన్న స్తంభాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిశ్వర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా పతంగి రామన్న ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎవ్వరికీ ఉపయోగపడకుండా క్రీడాకారులకు పాఠశాల కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటలాడుకోవడానికి అడ్డుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పరంగా ఆటల పోటీలు నిర్వహించాలంటే ఇవి మరి అడ్డుగా మారాయన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు వీటిని ఎందుకు తొలగించడం లేదని ఆయన ప్రశ్నించారు. క్రీడా మైదానం అన్యాక్రాంతానికి గురవుతోందన్నారు. ఒకప్పుడు రాష్ట్రస్థాయి లాంటి అథ్లెటిక్స్ వంటి పోటీలు కూడా నిర్వహించారని అన్నారు. పట్టణంలోని ప్రజలకు, యువతకు క్రీడా మైదానం అనువుగా ఉందన్నారు. ఈ స్థాయిలో జిల్లాలో ఎక్కడ లేదన్నారు. అధికారులు స్పందించి పతంగి రామన్న ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సూరి, రాఘవ, కేశవ పాల్గొన్నారు.



పుస్తక పఠనంలో విద్యార్థులు

దేశ చరిత్రపై విద్యార్థుల పఠనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులచే దేశ చరిత్రపై కతన పఠనాన్ని చేయించారు. గ్రంథాలయ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ దేశ చరిత్రపై, స్వతంత్ర సమరయోధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అన్నను కత్తితో పొడిచిన తమ్ముడు

తీవ్రగాయాలతో రిమ్స్‌లో చేరిక

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

అన్నను కత్తితో పొడిచిన తమ్ముడు సంఘటన మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని జమాల్‌పల్లి గ్రామంలో అక్బర్, బాషాఖాన్ అన్నదమ్ములు. శనివారం అన్న అక్బర్ ఇంటి నిర్మాణ పనులు చేయించుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య స్థలం విషయంలో మాటమాట పెరిగింది. ఉన్నఫలంగా తమ్ముడు బాషాఖాన్ కత్తితో అన్నను పొడవగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.